


# ప్రహాస్ ప్రేమ

రావేటి రామకృష్ణారావు

మిట్టమధ్యాహ్నం . బయట ఎండ తీక్షణంగా ఉంది. చెమటలు అంతగా పట్టకపోయినా హైదరాబాద్‌లో ఎండాకాలం వేడి, చలికాలంలో చలి విపరీతంగా ఉంటాయి. అప్పుడే హోటల్ భోజనం చేసి ఇంట్లో కొచ్చాడు ప్రహాస్. బెడ్‌రూమ్‌లోని ఎయిర్ కూలర్ని ఆన్ చేశాడు. కాసేపట్లో గది చల్లబడింది . చల్లని గాలి మంచం మీద వాలిపోయాడు. కానీ అతనికి కళ్ళు పొడుచుకున్నా నిద్ర రావడం లేదు. ఒకటే ఆలోచనలు. అమ్మ విశాఖపట్నం వెళ్ళింది. మరోపది రోజులదాకా రాదు. సాయంత్రం బెంగుళూరు తన కాబోయే భార్య ప్రస్తుత ప్రియురాలు ఉమతో వెళుతున్నాడు. అమ్మకి ఉమని గురించి తన ప్రణయం గురించి ఇంకా చెప్పనే లేదు. చెప్పినా అమ్మ తన మాట కాదనదని తెలుసు. అయినా ఎందుకనో ఉమని అమ్మకింకా పరిచయం చెయ్యలేదు. అమ్మతో విశాఖపట్నం వెళ్ళడానికి సెలవు దొరకదని అబద్ధం చెప్పి ఒక్కదాన్నే ట్రెయిన్ ఎక్కించాడు. ఇదే అదనని ఉమ ఈ బెంగుళూరు ట్రిప్ వాళ్ళ నాన్నగారి ద్వారా ఏర్పాటుచేసింది. వద్దన్నా వినకుండా ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకోవడానికి ఇలాంటి ప్రయాణాలు మంచివని వాళ్ళనాన్న, అమ్మగారు కూడా ప్రోత్సహించి టిక్కెట్లు రిజర్వేషను చేయించి బెంగుళూరులో ఉన్నవాళ్ళ చిన్నాన్నగారింటికి సంపుతున్నారు.

ప్రహాస్ మనసు బాగులేదు. అమ్మకి తెలిస్తే బాగుండదు. ప్రాణపదంగా నాన్నగారు పోయిన దగ్గర్నుంచీ కంటికి రెప్పలాగా పెంచి చదివించింది. బ్యాంకులో ఉద్యోగం రాగానే మామయ్య సంరక్షణలో ఇంతకాలం విశాఖపట్నంలో ఉన్న తాము హైదరాబాదు వచ్చి రెండేళ్ళు దాటింది. ఆలోచిస్తున్న ప్రహాస్ కళ్ళు మూతలు పడబోతూ ఉండగా వాళ్ళమ్మగారి గదిలో ఏదో చప్పుడైంది. ఉలిక్కి పడిలేచి ఆ గది అడ్డగెడ తీసి లోనికి ప్రవేశించాడు. అమ్మ వెళ్ళిన దగ్గర్నుంచీ ఆ గది మూసే ఉంది. సాధారణంగా ప్రహాస్ ఆ గదిలోకి వెళ్ళడు. ధ్యానం, పూజ మొదలైన కార్యక్రమాలన్నీ వాళ్ళమ్మ ఆ గదిలోనే చేసుకుంటుంది. లోపలికి ప్రవేశించగానే ఏదో పవిత్రమైన భావన. పూలు, ఇతర సుగంధ ద్రవ్యాల వాసన. అక్కడ ఓ మూల పీఠం మీద ఆసీనమైన నాన్నగారి ఫోటో. నాన్న తన ఐదో ఏటనే పోయారు. అమ్మ రోజూ తాజా పూలమాల చేసి ఫోటోకి వేసి పాతది తీసేస్తుంది. ప్రస్తుతం ఉన్న దండలో పూలు కాస్త వాడి ఉన్నాయి. వ్యాసపీఠం మీద భగవద్గీత దాని మీదనే ఉండే నాన్నగారి డైరీ కిందపడి ఉంది.

ఏ ఎలకో పడదోసి ఉంటుంది. ప్రసాదం అరటి పళ్ళు తినడానికి ఎలకలు వస్తుంటాయి.

డైరీ తీశాడు. తను ఏనాడూ చదవ లేదు. ఒకరి డైరీ చదవకూడదు. అంత ఆసక్తీ తనకి లేదు. కాని ఎందుకో ఒక్క పేజీ చదవాలనిపించింది. అమ్మ పూజ మొదలు పెడితే తన గదిలో నుంచి రెండు గంటలు దాకా బయటికి రాదు. ఒకరోజు తలుపు సందులో నుంచి చూశాడు. అమ్మ నాన్నగారి డైరీ చదువుతూ కనిపించింది. 2 వ పేజీ చదువుదాం పోయే దేముంది. నిద్ర ఎలాగూ రావడంలేదు. మరో రెండు గంటలకి ఉమ ఫోను చేస్తుంది. సర్ది ఉన్న సూట్‌కేసుతో ఆటోలో బయలు దేరాలి. ఈ లోగా కాలక్షేపం.

డైరీ తీసుకుని తన పడక గదిలోని మంచం మీద వాలి డైరీ మధ్యలోని ఒక పేజీ తెరిచాడు.

విచిత్రంగా పాతిక సంవత్సరాల క్రితం తను పుట్టిన రోజు అది. అమ్మ తన పెళ్ళి నాటి నుంచి నాన్నగారు చనిపోయిన దాకా రాసిన డైరీలని గీతాపారాయణం చేసినట్లు మళ్ళీ మళ్ళీ చదువుతూనే ఉంటుంది. చదువుతూ నవ్వుకుంటుంది. దుఃఖిస్తుంది. నాన్న గారు తన సన్నిధిలో నున్న అనుభూతి పొందుతూ ఉంటుంది.

అమ్మని తను ఏనాడూ ఎందుకమ్మా చాదస్తం అనలేదు. అమ్మ హాయిగా ఉండాలి తనకి కావలసినదదే.

డైరీలో నాన్నగారు రాసిన నా జన్మదినం నాటి విషయాలు చదవడంలో నిమగ్నమయ్యాను.

పేజీకి పైన "మా బంగారు కొండ పుట్టిన దినం అని అండర్‌లైను చేసి ఉంది. వెరీ ఇంటరెస్టింగ్ అనుకుని అక్షరాల దారుల వెంట దృష్టి పరుగుతీసింది.

చిట్టికన్నా! ఎందుకనో ఈరోజు డైరీని నిన్ను సంబోధించి రాయాలనిపించిందిరా.. ఓ గంట క్రితమే నిన్నూ, మీ అమ్మనీ టాక్సీలో ఇంటికి తీసుకొచ్చాను. మీ అమ్మ ఇప్పుడే నిశ్చింతగా నిద్రపోతున్నది. నువ్వు మీ అమ్మ పక్కనే తూగుటుయ్యాలలో బాలకృష్ణుడిలా నిద్రపోతూ మధ్య మధ్య నవ్వుతున్నావు. మమ్మల్ని కాపాడడానికి నిన్ను ఏ దేవుడు పంపించాడురా. నువ్వెవరివి? ఎవర్ని చూసి నవ్వుతున్నావు? బాగా ముద్దొస్తున్నావు. ముద్దు మాటలు తరువాత. ముందుగా నేను చెప్పేది విను. నేను నిన్ను సంబోధించి రాస్తున్నానేగాని నువ్వీడైరీ ఏనాడైనా చదువుతావో లేదో అయినా నీతో మాట్లాడాలనిపించింది రాస్తున్నాను.

పుట్టే ముందు మమ్మల్ని చాలా ఏడిపించావురా. బంగారు తండ్రీ! ముఖ్యంగా మీ అమ్మని.

నువ్వు మరో వారంరోజుల్లో పుడతావనగా భలే గందరగోళం అయింది. మీ అమ్మ ఒంట్లో రక్తం చాలదని రక్తహీనతవల్ల ఎనీమిక్ వ్యాధి అనీ రకం ఎక్కించాలనీ డాక్టర్లు చెప్పారు. వెంటనే ఓ మంచి నర్సింగ్ హోమ్‌లో చేర్పించాను. ఎన్నో పరీక్షలు. రక్తం గ్రూపు మొదలైన పరీక్షలు. ఆ రోజు వార్డులో బెడ్ మీద మీ అమ్మ పడుకుని ఉంది. స్టీలు స్టాండుకి రక్తం బాటిల్ వేలాడుతున్నది. ప్లాస్టిక్ ట్యూబ్‌లో నుంచి ఒక్కో

బొట్టు రక్తం మీ అమ్మ శరీరంలో ప్రవేశిస్తున్నది. మో చెయ్యి ముందటి భాగంలో సిరంజి సూది నుంచి రక్తం రక్తపు శిరలలోకి మెల్లగా ప్రవహిస్తున్నది. ఒక వెయిన్ పనికి రాకుండా పోవడం మరో వెయిన్‌ని వెతికి వెతికి మళ్ళీ మళ్ళీ సూదిని గుచ్చడం ఓహ్! చెప్పలేను ఆ బాధ. పాల రాతి లాంటి మీ అమ్మ చేతులలో శిరల రక్తనాళాలు నీలంగా పారదర్శకంగా కనిపిస్తున్నాయి. మరో రక్తనాళం కనిపించే దాకా నలగగొట్టడం. కళాహీనంగా మారిన ఆ చేతిని చూడలేక పోయాను.

పరీక్షల్లో తేలిందేమంటే రక్తం నానాటికీ క్షీణించి పోతున్నదనీ ఎర్ర రక్తకణాలు నాశనం అవుతున్నాయనీ, బ్లడ్ కౌంట్ చాలా తక్కువగా ఉన్నదనగానే నేను క్యాన్సరేమోనని భయపడ్డానురా. ఎందుకంటే మన కుటుంబానికి క్యాన్సర్ భయం ఉంది. మీ నాయనమ్మ అనగా మా అమ్మకి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది. మా నాన్నగారు అంటే నీ తాతగారన్నమాట. 'బ్రతికి ఉంటే అదే పదివేలు బ్రెస్ట్‌ని తీసెయ్యండి డాక్టర్" అని ఏడ్చాడు. అదో పెద్ద కథ.

మీ అమ్మ వేపు నుంచి కూడా వాళ్ళ అమ్మ తమ్ముడు అంటే మీ అమ్మకి మామయ్య అన్నమాట. కంగారు పడకు ఈ వావివరసలన్నీ ముందు ముందు నీకు తెలుస్తాయిలే. ఆయనకూడా క్యాన్సర్‌తోనే చనిపోయాడనీ, ఒక చోట ఆపరేషను చేసి ఆ రాచకురుపుని తీసేస్తే మరో చోట గడ్డలు లేచి చివరికి చనిపోయాడని చెప్పిందిలే. ఇలాంటి విషయాలు పుట్టిన నాడే ఎందుకు చెపుతున్నాననుకోకు. నేనింక ప్రతి విషయాన్నీ నీకు చెబుతాన్రా ఏదీ దాచను. అవన్నీ మనసులో మెదిలి భయపడ్డాను.

రక్తం సరిగా ప్రవహించడానికి స్టాండు ఎత్తు పెంచడం, దించడం లెక్కప్రకారం రక్తపు చుక్కలు పడుతున్న దీ లేనిదీ గ్రహిస్తూనే ఉన్నాను.

మరునాడు మళ్ళీ మీ అమ్మ రక్తం తీసి పరీక్షించారు. అయినా బ్లడ్ కౌంట్ పెరగలేదు. కారణం ఏమిటో ఆ స్పెషలిస్టులకి అర్థం కాక మీ అమ్మ వెన్ను పూసలో నుంచి మూలుగ (Bone Marrow) తీసి చూడాలని పెద్ద సిరంజి సూదితో వచ్చారు. నా ప్రాణాలు విలవిలలాడాయి. నువ్వు గనుక చూస్తే నా బంగారు కొండ భయపడిపోయి మీ అమ్మ కోసం బెంగెట్టుకుని ఏడ్చేవాడివి తెలుసా!

"భయపడకండీ. ఇది నేస్ట్ కాకపోవచ్చును" అన్నారు డాక్టర్లు. క్యాన్సర్‌కి పర్యాయపదంగానే నేస్ట్‌ని వాడారని అర్థం చేసుకున్నాను.

అది మేగ్నో బ్లాస్టిక్ ఎనీమియా అని తేలింది. అది కేవలం రక్తంలో దోషమే కాని క్యాన్సర్ లాంటి ఏ వ్యాధీ కాదని తెలిసి ఊపిరి పీల్చుకున్నాను.

అదేమిటో మాయ. చిన్నపిల్లలంటే నాకూ మీ అమ్మకూ ఇష్టం. మేమిద్దరం ఒక్కటి కాక ముందు నుంచీ నీ గురించిన ఆలోచనలే. నిన్ను చూడకుండానే నిన్ను ప్రేమించాం. నువ్వు కడుపున పడ్డావు. ఇంక మా ఊహలన్నీ నీ చుట్టూనే అల్లుకున్నాయి. ఎన్నో కలలు కన్నాం. ఇంక ఇప్పుడు మీ అమ్మ దక్కకపోతే బతకగలనా. స్త్రీ బిడ్డని ప్రసవించడం గండం లాంటిదనీ ప్రసవించి జీవించడం స్త్రీకి మరుజన్మ అనీ పెద్దలంటారు. అదే కాదు నా బాధ. పుట్టిన వెంటనే తల్లిని పోగొట్టుకున్న నష్టజాతకుడు అని నిన్ను లోకం అంటూ ఉంటే చూడగలనా. అలాంటి అపఖ్యాతి నీకు వస్తే నేను భరించగలనా. మీ అమ్మా నువ్వూ క్షేమంగా ఉండాలి నిన్నొక రారాజు బిడ్డలాగా పెంచాలి. అదే నాకోరిక.

నువ్వు అబ్బాయివో అమ్మాయివో మాకప్పటికి తెలియదుగదా. అయినా ముందే మా కిష్టమైన "ప్రహాస్" అని పేరు పెట్టేశాం. ఒకవేళ ఆడపిల్లైతే 'ప్రహాసిని'గా మారిపోతుందా పేరు అనుకున్నాం.

మాటిమాటికీ డాక్టర్లతో బ్లడ్ సరిపోతుందా ప్రమాదం లేదు గదా అని అడిగేవాడిని.

"ఫరవాలేదండీ బాబు. ఇంత కంగారైతే ఎలా. బ్లడ్ కౌంట్ ఆరుకన్నా ఎక్కువ ఉంటే భయపడవలసిన అవసరం లేదు. ఇప్పుడు ఎనిమిదికి పైనే ఉంది అని చెప్పారు. తరవాత పన్నెండు దాకా వచ్చేలాగా రక్తం ఎక్కించారు.

నువ్వు పుట్టావు. సిస్టర్ లేబర్ రూములో మొదట నిన్ను చూసి "మగపిల్లాడు" అని చెప్పింది.

నా ఆనందానికి అవధుల్లేవు.

మీ అమ్మ అప్పుడేమన్నదో తెలుసా నాన్నా.

"మీకు మన బాబుని కానుకగా ఇచ్చాను. ఇంక నేనేమైనా ఫరవాలేదు" అని.


నిన్ను చూసిన ఆనందంలో ఆమె పడ్డ బాధలు, కష్టాలు ఏమయ్యాయో మరి. ఆమె ముఖంలో ఎప్పటి కళ, ఆ కళ్ళ లోనేనెప్పుడూ గమనించే తేజస్సూ కనిపించింది. ఇద్దరం నిన్ను గమనిస్తూనే గడిపాం. ఓ కొత్త ముఖం, ఓ కొత్త వ్యక్తిని ఈ లోకానికి ప్రసాదించాం. దంపతులుగా మా దాంపత్య జీవితాన్ని సఫలం చేసిన బంగారు కొండవి నువ్వు. నీ కళ్ళు మీ అమ్మ కళ్ళే. కానీ నువ్వు నన్ను గాని మీ అమ్మనిగానీ పూర్తిగా పోలలేదు. నీకు మా ఇద్దరి తాతయ్యల పోలికలు వచ్చాయి. మీ అమ్మ నాన్నగారి నుదురూ, మా నాన్నగారి ముక్కూ నోరూ కలిశాయి.

ఆ నోటినీ మా నాన్నగారు తిట్టడానికీ కసరడానికీ ఎప్పుడూ వాడలేదు. ముద్దు మాటలు చెప్పడానికి వాడారు. మా నాన్నగారంటే నాకు ప్రాణం రా. ఆయనిప్పుడు లేరు. ఇంక నువ్వే నా కన్న తండ్రివిరా.

కళ్ళనీళ్ళు నిండగా ఆ పేజీని పూర్తిచేశాడు ప్రహాస్.

రుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు. తను పుట్టిన రోజునో లేక మరో మూడు రోజుల తరవాతనో వీలుచూసుకుని ఊయలలో నిద్రపోతున్న నన్ను చూస్తూ నాన్నగారు రాసిన డైరీ. నాన్నాగారి దస్తూరి తానెన్నడూ చూడలేదు. ఓ వింత అనుభూతి. ఎప్పుడో ఇరవై ఏళ్ళ నాడుతన ఐదో

## సంతృప్తి అంటే అదే!



'కహో నా ప్యార్ హై' చిత్రం హీరో హృతిక్‌రోషన్ చాలా ఆనందంగా వున్నవారిలో మొదటివాడు-నేటి లెక్కల ప్రకారం. ఎందుకంటే ఏమవుతుందో-ఏమవుతుందో అనే చింతతో ఎదురుచూసిన అతని తొలిచిత్రం 'కహో నా...' సూపర్‌హిట్టయింది. ఒక్క చిత్రంతోనే హృతిక్ రోషన్ పరిశ్రమకు బంగారు గుడ్లు పెట్టే బాతు అయిపోయాడు. పెద్ద హీరోలైన ఆమీర్, షారూఖ్ ఖాన్లు నటించిన చిత్రాలు ఘోరంగా దెబ్బ తిని, కొత్త హీరో హృతిక్ నటించిన చిత్రం హిట్టవ్వటం ఓ రికార్డు బ్రేక్ మరి! మరో విషయమేమిటంటే, హృతిక్ తండ్రీ, అలనాటి నటుడూ, నేటి దర్శకుడూ అయిన రాకేశ్‌రోషన్ మీద హత్యాప్రయత్నం జరగడం, ఆయన వెంట్రుకవాసిలో మృత్యువును తప్పించుకుని బయటపడటం! దీనికి బాధపడుతున్న హృతిక్‌తో రాకేశ్ ఏమంటున్నారంటే, "బతికి బయటపడ్డందుకు సంతోషించు! భగవంతుడికి కృతజ్ఞులుగా వుండాలి మనం-ఇంకా ఘోరం జరిగిపోనందుకు!" అని! నిజమే కదా! ప్రాణాలకన్నా ముఖ్యమైనదేదైనా వుందా?

ఏట పోయారు. డైరీని నాన్నగారి దస్తూరీతో రాసిన పేజీని కళ్ళకద్దుకున్నాడు. ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగలేదు.

తరవాత మరికొన్ని పేజీలు చదివి తన చిన్న నాటి ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. తన కోసం ఎన్ని కష్టాలు పడ్డారు. కళ్ళు ధారాపాతంగా వర్షించాయి. వెక్కి వెక్కి ఏడ్చాడు. నాన్నా నీలాంటి ప్రేమైక మూర్తి ఆలింగనాలకు ముద్దులకు నోచుకోలేని పాపాత్ముడిని. ఎంత కాలానికి నువ్వు నాతో మాట్లాడావు నాన్నా. నన్ను అయిదో ఏటనే అమ్మ రక్షణకి వదిలి ఓ లోకాలకు వెళ్ళిపోయావు.



తప్పుతోవపట్టబోతున్న నన్ను అగాథంలో పడిపోబోతున్న నన్ను సమయానికి రెక్క పట్టుకుని పడిపోకుండా కాపాడావు. నన్ను క్షమించు నాన్నా.

అమ్మతో సెలవు దొరకదని అబద్ధం చెప్పాను. నన్ను ప్రేమగా చిన్ననాటి నుంచి పెంచిన అమ్మమ్మ చనిపోతే సెలవు దొరకదు. పెద్ద ఖర్మకి వచ్చి నిన్ను తీసుకొస్తాను. ఇప్పుడు నేను వచ్చి చేసేదేముంది. మామయ్యతో ఏమీ అనుకోవద్దని చెప్పు అని అమ్మని గోదావరి ఎక్కించి విశాఖపట్నం ఒంటరిగా పంపించేసిన దుర్మార్గుడిని.

ప్రకృతి సహజమైన ఆకర్షణకి లోనై నేను చేసిన తప్పు ఎంత ఘోరమైన దో తెలుసుకోలేకపోయాను. క్షమించు. ఉమతో స్పష్టంగా సిగ్గు విడిచి నేను తల్లి చాటు బిడ్డనని చెప్పే స్తాను నాన్నా. మీ రక్తం నాలో ప్రవహించడం వల్లనో ఏమో ఉమతో ఎన్ని అవకాశాలు వచ్చినా ఎంత బలవంతం చేసినా నేను చీకటి తప్పు చెయ్యలేదు నాన్నా. ఉద్యోగం చేస్తున్న ప్రయోజకుడైన బ్రహ్మచారికి ఆడపల్ల తల్లిందండ్రులు ఎలాంటి వలవిసురుతారో తెలుసుకున్నాను. సిగ్గైనా లేకుండా ఒంటరిగా ఉమని నాతో ఆమే తల్లి దండ్రులు బెంగుళూరు పంపదలచుకున్నారంటే ఏమిటి. నన్ను అమ్మకి దూరం చెయ్యాలనుకున్నారు నాన్నా.

నేను బెంగుళూరు వెళ్ళడం లేదు నాన్నా. సూటుకేసు ఎలాగూ సర్ది రెడీగానే ఉంది. ఇప్పుడే తయారై ఏ రైలో ఏ బస్సో పట్టుకుని ఇప్పుడే విశాఖపట్నం వెళ్ళి అమ్మ కాళ్ళ మీద పడే దాకా నాకు నిష్కృతి లేదు.

అంతలో హాల్లో ఫోను మ్రోగింది. ఉమ అయి ఉంటుంది. రింగవుతూనే ఉంది. డైరీ మంచం మీద పెట్టి హాల్లోకి వెళ్ళి క్రెడిల్ పై నుంచి హేండ్ సెట్ పైకి లేపాడు.

"హల్లో" అని ఉమ గొంతు వినిపించింది. ఆ గొంతు చిరాకుని పులుముకుని ఉంది.

"ఏం చేస్తున్నావు ప్రహాస్. రింగవుతున్నా ఎత్తవేం. ఇప్పుడే వచ్చావా నువ్వు".

ప్రహాస్‌కి ఏమీ మాట్లాడాలని పించడంలేదు.

చాల దూరపు బంధువులు. తనకి హైదరాబాద్ లో జాబ్ అయినట్లు విశాఖపట్నంలోని వాళ్ళచుట్టాల ద్వారా తెలుసుకుని బ్యాంకుకు వచ్చి పరిచయం చేసుకున్నారు. ఉమ రెండు రోజులకీ మూడు రోజులకీ వచ్చేది. వాళ్ళనాన్నగారి చేత బ్యాంకులో ఎకౌంటు తెరిపించింది. లక్షరూపాయలు ఫిక్స్డ్ డిపాజిట్ చేయించింది. తనేం నచ్చాడో మరి. వాళ్ళ ఇంటికి కూడా తీసుకెళ్ళారు.

"మీరు" అని మొదలు పెట్టిన ఉమ మూడు రోజులలోనే నువ్వు దాకా చనువు పెంచేసింది. తనకీ నువ్వు అలవాటు చేసేసింది. ఇప్పుడా నువ్వు నువ్వేంత నువ్వగింజంత అని వినిపిస్తున్నది.

హల్లో! హల్లో! అసలు వింటున్నావా నువ్వు. కూచునే కునుకుపాట్లు పడుతున్నావా? మాట్లాడవేం"

"ఏం మాట్లాడాలి" అన్నాడు.

"ఏం మాట్లాడాలా. నీకేమైనా పిచ్చి పట్టిందా ప్రహాస్. అసలు నువ్వే ఫోను చేస్తావనుకున్నాను. ఇప్పుడు టైమెంతయిందో చూడు. తీరా నేనే ఫోను చేస్తే ఏం మాట్లాడాలి అంటావా? దీనికి నువ్వు సంజాయిషీ చెప్పితీరాలి. అంది జోవియల్‌గా కోపాన్ని మిళాయిస్తూ.

ఇవ్వకపోయినా బలవంతంగా తీసుకున్న చనువు. మొదటే అదుపులో పెట్టవలసింది అయినా ఆరు నెలల్లో ఇంత నెత్తికెక్కయ్యడమేనా. పెళ్ళయితే ఉమను భరించగలడా.

ప్రహాస్‌కి భరించలేనంత కోపం వచ్చింది. ఇదెక్కడి సంప్రదాయం. మొన్నటికి మొన్న "మా అమ్మకి పరిచయం చేస్తాను రా" అనంటే

ఎందుకు ప్రహాస్. పెళ్ళయిన తరవాత ఆవిడే చూస్తుంది. మనిద్దరం ఒకరి నొకరం ఇష్టపడ్డాం. ఇప్పుడే చెప్పుతున్నాను. మా వాళ్ళు కాదన్న మీ అమ్మ వద్దన్నా మనం పెళ్ళి చేసుకుంటున్నాం. నాకీ అరేంజ్డ్ పెళ్ళిళ్ళంటే అసహ్యం" అంది. మొదటి నుంచీ స్త్రీవాదం బాగా వంటబట్టించుకున్నది. ఆమె చాలా అభిప్రాయాలతో ఏకీభవించలేకపోయినా తను ముభావి కావడం చేత గంగిరెద్దులాగా తలఊపుతున్నాడు. తనని వాళ్ళింట్లో అందరూ చూశారు. మరి అమ్మ ఉమని చూడడంలో తప్పేముంది. స్త్రీ పురుష సమానత్వానికి తానెప్పుడూ సుముఖుడే. కాని తన వ్యక్తిత్వాన్ని తోసిరాజని తన ఆధిక్యతని ప్రదర్శిస్తున్నదే.

"ప్రహాస్. టెలిఫోన్ చివర్న నేనున్నాను. పట్టపగలే కలలు కంటున్నావా? కనీసం మన ప్రోగ్రామ్ జ్ఞాపకం ఉందా" అని గట్టిగా అరిచింది.

ఈ మధ్య తనిచ్చిన లీనియన్స్ ముద్దులు ఆలింగనాలతో మతిపోగొట్టింది. తరవాత తనే అడ్వాన్సు చేస్తాననుకుంది. తన జాగ్రత్తలో తానుండడం మెరుగైంది. ఇంక మాట్లాడే ఛాన్సు ఇవ్వదలచుకోలేదు.

ఉమా! ఫోను పెట్టేయ్. నేను అర్జంటుగా విశాఖపట్నం మా అమ్మదగ్గరికి వెళుతున్నాను" అని కట్ చేశాడు.

వెంటనే బయలుదేరి ఆటోలో వచ్చేసినా వచ్చెయ్యవచ్చు. బట్టలు వేసుకుని గబగబా ఆటో తీసుకుని సికింద్రాబాదు స్టేషన్ చేరుకోవాలి.

బట్టలు వేసుకుని ముందుగానే సర్దుకున్న సూట్‌కేసు అందుకున్నాడు.

అంతలోనే మళ్ళీ ఫోను రింగైంది. అవతల ఉమ. ఆమెని మాట్లాడనివ్వలేదు ప్రహాస్.

"హలో! ఉమా చెపుతున్నది జాగ్రత్తగా విను. నా వల్ల పెద్ద ఘోరం జరిగిపోయింది. వెంటనే వైజాగ్ వెళ్ళాలి. అమ్మని కలవాలి. మా అమ్మమ్మ పెద్ద ఖర్మ తరవాత అమ్మతో కలసి వస్తాను. వచ్చిన తరవాత కలుస్తాను.. లేకపోతే నువ్వే కలుద్దువు గాని.మన బెంగుళూరు టిక్కెట్లు కేన్సిల్ చేయించెయ్. మీ బాబాయి వాళ్ళకి మనం రావడం లేదని బెంగుళూరుకి ఫోను చేసి చెప్పెయ్యి." ఫోను క్రెడిల్ మీద పెట్టేశాడు.

సూట్‌కేసు పట్టుకుని ఇంటికి తాళం వేశాడు. అమ్మ ప్రసన్న వదనం మదిలో మెదులుతోంది. తన కర్తవ్యం బోధపడింది. లోపల ఫోను రింగవుతూనే ఉంది. ప్రహాస్ తల్లికి పుత్రోత్సాహం కలిగించే పరుగులో పడ్డాడు. ●